ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
పెద్దపల్లి
జిల్లా వార్తలు
5★
శనివారం 2 మార్చి 2024



పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండ 8లో..
వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు 8లో..



తీరనున్న 'ధరణి' కష్టాలు

- పెండింగులో 4వేలకు పైగా దరఖాస్తులు
- వారంరోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వ ఆదేశం
- తహసీల్దార్లు, ఆర్డీవోలకు బాధ్యతలు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రెండున్నరేళ్ల నుంచి 'ధరణి'తో ఇబ్బందులు పడుతున్న రైతుల కష్టాలు తీరనున్నాయి. భూముల వివరాలకు సంబంధించి తప్పొప్పులు రావడం, సర్వేనంబర్లు, పేర్లు, ఇతరత్రా వివరాలు తప్పుగా పడడం, ఒక పట్టాదారుడికి బదులు మరో పట్టాదారుడి పేరు రావడం, సర్వే నంబర్లు మారడం, విస్తీర్ణం ఎక్కువ, తక్కువగా పడడం, పట్టా భూములు ప్రొహిబిటెడ్‌లో ఉండడం వంటి సమస్యలతో అనేకమంది రైతులు మండల తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు. వీటి పరిష్కారానికి గత ప్రభుత్వం వివిధ మ్యాడ్యూల్స్‌ను ధర ణి పోర్టల్‌లో ప్రవేశ పెట్టినప్పటికీ, పెద్దగా పరిష్కారానికి నోచుకోలేదు. ఒక్కో దరఖాస్తుపై క్షేత్రస్థాయిలో విచారణ జరిపి కలెక్టర్‌కు నివేదికలు సమర్పించిన తర్వాత కలెక్టర్ తన పరిధిలో ఉంటే అక్కడే పరిష్కరించి, తన పరిధిలో లేని వాటిని సీసీఎల్ఏకు పంపించారు. కొందరి సమస్యలు పరిష్కారం అయినప్పటికీ జిల్లాలో ఇప్పటివరకు 4వేలకు పైగా దరఖాస్తులు పెండింగులో ఉన్నట్లు తెలుస్తున్నది. ధరణి పోర్టల్ అంతా లోపభూయిష్టంగా ఉందని, దీని వల్ల విలువైన భూముల డేటా చౌర్యానికి గురవుతున్నదని, అనేక మంది రైతుల భూములు మాయం అయ్యాయని, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే ప్రక్షాళన చేస్తామని సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సందర్భంగా ప్రకటించారు.

రికార్డులు పరిశీలించి..

ప్రభుత్వ ఆదేశాల మేరకు టీఎం 4,10,14,32 మాడ్యుల్స్‌లో ఉన్న సక్సేషన్, జీపీఏ/ఎస్‌పీఏ, భూ రికార్డుల అంశాలలో ఫిర్యాదులు, ఖాతా మేర్జింగ్ సంబంధిత దరఖాస్తులు తహసీల్దార్ స్థాయిలో రికార్డులు పరిశీలించి చర్యలు చేపట్టాలన్నారు. ఒక వేళ దరఖాస్తులను తిరస్కరించినట్లయితే తగిన కారణాలతో సమాచారం దరఖాస్తుదారులకు ఇవ్వనున్నారు. టీఎం 7, 16, 20, 22, 33 మాడ్యుల్స్‌లో ఉన్న నాలా(పాస్ బుక్ లేకుండా), భూసేకరణ ఫిర్యాదులు, ఎన్ఆర్ఐ పోర్టల్, సంస్థల పట్టా పాస్ పుస్తకం, కోర్టు కేసులు, మిస్సింగ్ సర్వేనంబర్, విస్తీర్ణ సవరింపు(5 లక్షల విలువ వరకు) మొదలగు దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారణ నిర్వహించి సిఫార్సులతో ఆర్డీవోకు పంపాలని, సదరు ఆర్డీవో ఆ దరఖాస్తులపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. కేఎల్ ఫారం, టీఎం 3,4,15,23,24,31,33 మాడ్యూల్స్‌లో ఉన్న మ్యూటేషన్, అసైన్ భూముల సక్సేషన్(పీపీబీ లేకుండా), ప్రొహిబిటెడ్ జాబితా ఆస్తుల సమస్యలు, పట్టా పాస్‌పుస్తకం, సెమీ అర్బన్ ల్యాండ్ పట్టా పాస్‌పుస్తకం కోర్టు కేసులు, నాలా కన్వర్షేషన్, పట్టా పాస్‌పుస్తకంలో సవరింపులు మొదలగు దరఖాస్తులపై కలెక్టర్ నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం పేర్కొంది. కేఎల్ ఫారం దరఖాస్తులను ఆర్డీవో, మిగిలిన మాడ్యూల్స్ దరఖాస్తులను తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో విచారించి నివేదిక అందించనున్నారు. వాటి ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. ప్రతి మండలంలో తహసీల్దార్, డిప్యూటీ తహసీల్దార్, ఆర్ఐలు బృందంగా ఏర్పడి పరిష్కరించాలన్నారు. వారంరోజుల్లో పెండింగులో ఉన్న దరఖాస్తులన్నింటిని పరిష్కరించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆ మేరకు కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్, ఆర్డీవోలు, తహసీల్దార్లతో సమీక్షా సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు.

అధికారంలోకి రాగానే ఆ మేరకు ధరణి పోర్టల్‌పై అధ్యయనం చేసేందుకు ఒక కమిటీని వేశారు. కమిటీ సూచనల మేరకు పెండింగులో ఉన్న దరఖాస్తులను వారం రోజుల్లో పరిష్కరించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈక్రమంలో తహసీల్దార్లు, ఆర్డీవోలకు కూడా పలు అధికారాలను కట్టబెట్టింది.

చివరి ఆయకట్టు వరకు సాగునీరందించాలి : కలెక్టర్

పెద్దపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని రైతులతో సమన్వయం చేసుకుంటూ పంటలు ఎండిపోకుండా చివరి ఆయకట్టుకు సాగునీరు అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఆదేశించారు. శుక్రవారం ఆయన సమీకృత కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో ఎస్సారెస్పీ డీ- 83, 86 కాల్వల కింద 5వ తడి నీటి విడుదలపై సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యాసంగి సాగులో నీటి విడుదలపై రైతుల్లోని అపనమ్మకాలను తొలగించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. ఎస్సారెస్పీ నుంచి 5వ తడి కోసం 7 వేల క్యూసెక్కుల నీటి విడుదల చేస్తున్నారని, జిల్లాలోని డీ- 83, 86 కాలువలకు 2500 క్యూసెక్కుల నీటిని అందిస్తున్నారని తెలిపారు. వారంలో 3 రోజుల పాటు (సోమ, బుధ, శనివారం) సాగునీటి విడుదలపై సమన్వయ సమావేశం నిర్వహించుకోవాలని ఆదేశించారు. డీఏవో ఆదిరెడ్డి, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి, నీటి పారుదల శాఖ ఇంజనీర్లు, వ్యవసాయ శాఖ అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ గూటికి రామగుండం మేయర్?

గోదావరిఖని, మార్చి 1: రామగుండం మేయర్ బంగి అనీల్ కుమార్ కాంగ్రెస్‌లో చేరనున్నారని సమాచారం. ఆయనతో పాటు బీఆర్ఎస్‌కు చెందిన సుమారు 20 మంది కార్పొరేటర్లు చేరనున్నారని తెలిసింది. ఈ మేరకు వారు ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో చర్చలు జరుపుతున్నారు. రెండు మూడు రోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమక్షంలో అధికారికంగా కాంగ్రెస్‌లో చేరేందుకు ముహూర్తం నిర్ణయించుకున్నారు. రామగుండం నగరపాలక సంస్థలో 50మంది కార్పొరేటర్లకు 41మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌లో ఉన్నారు. కాంగ్రెస్‌లో 10మంది కార్పొరేటర్లు ఉన్నారు. వీరిలో మేయర్‌తో పాటు 20మంది కార్పొరేటర్లు కాంగ్రెస్ గూటికి చేరనున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే మాజీ డిప్యూటీ మేయర్ సాగంటి శంకర్, కార్పొరేటర్ దాతు శ్రీనివాస్‌తో పాటు మరో పది మంది కార్పొరేటర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌తో టచ్‌లో ఉన్నట్టు సమాచారం. మేయర్ వర్గం కార్పొరేటర్లు మరో పది మంది ఉన్నారు. వీరితో పాటు బీఆర్ఎస్‌లో కీలకంగా ఉన్న మరో ఐదుగురు కార్పొరేటర్లు చర్చలు జరుపుతున్నట్టు, శుక్ర వారం నాటికి వీరంతా కాంగ్రెస్‌లో చేరనున్నారని సమాచారం.

ఐజీగా బాధ్యతలు స్వీకరించిన కమిషనర్


సీపీ శ్రీనివాస్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న పోలీస్ అధికారులు

కోల్‌సిటీ, మార్చి 1: ఐజీగా పదోన్నతి పొందిన రామగుండం పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ శుక్రవారం ఐజీ హోదాలో కమిషనర్ బాధ్యతలు స్వీకరించారు. డీఐజీగా ఉన్న కమిషనర్ ఫిబ్రవరి 14న బాధ్యతలు స్వీకరించగా ఇటీవల ఐజీ పదోన్నతి లభించింది. రామగుండం పోలీస్ కమిషనరేట్‌లో సాయుధ పోలీసుల నుంచి ఆయన గౌరవ వందనాన్ని స్వీకరించారు. కార్యాలయంలో బాధ్యతలు స్వీకరిస్తూ సంతకాలు చేశారు. పెద్దపల్లి డీసీపీ చేతన, గోదావరిఖని ఏసీపీ ఎం రమేష్, పెద్దపల్లి ఏసీపీ జీ కృష్ణ, మంచిర్యాల ఏసీపీ ఆర్ ప్రకాష్, జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మల్లారెడ్డి, సీసీఎస్ ఏసీపీ వెంకటస్వామి, ఏఆర్ ఏసీపీ సుందర్‌రావు, ఇన్‌స్పెక్టర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షల నిర్వహణ

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు


పెద్దపల్లి, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): ప్రశాంత వాతావరణంలో కట్టుదిట్టంగా పబ్లిక్ పరీక్షలు నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి అన్నారు. శుక్రవారం హైదరాబాద్ నుంచి ఆమె డీజీపీ, రాష్ట్ర స్థాయి ఉన్నత అధికారులతో కలిసి ఇంటర్, 10వ తరగతి పరీక్షల నిర్వహణ, ప్రజా పాలన సేవా కేంద్రాల ఏర్పాటుపై కలెక్టర్‌లతో వీడియో సమావేశం నిర్వహించి సమీక్షించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, మార్చి 15 వరకు ఇంటర్ పరీక్షలు, మార్చి 19 నుంచి ఏప్రిల్ 2 వరకు 10వ తరగతి పరీక్షలు జరుగుతాయని, దీనికోసం పకడ్బందీ ఏర్పాట్లు ఏర్పాట్లు చేయాలని సీఎస్ ఆదేశించారు. ఇంటర్, 10వ తరగతి పరీక్ష కేంద్రాల లోపలికి ఎవరు సెల్ ఫోన్ తీసుకుని వెళ్లడానికి వీలులేదని, గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని కట్టుదిట్టంగా పరీక్షలు నిర్వహించాలని తెలిపారు. పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు సకాలంలో చేరుకునే విధంగా అవసరమైన రూట్లలో బస్సు సర్వీసులు నడపాలని, కేంద్రాల్లో విద్యార్థులకు అవసరమైన మౌళిక వసతులు ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని, ఎక్కడ చిన్న పొరపాటు కూడా జరగకుండా సజావుగా పరీక్ష నిర్వహించాలని సూచించారు. ప్రతి ఒక్క అర్హుడికి ప్రభుత్వ గ్యారెంటీ పథకాలు అందేవిధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ప్రతి మండలంలోని ఎంపీడీవో కార్యాలయంలో, అదేవిధంగా మున్సిపాలిటీలో అవసరమైన మేర ప్రజాపాలన సేవా కేంద్రాలను ఏర్పాటుచేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. ఈ కాన్ఫరెన్స్‌లో జిల్లా విద్యాశాఖ అధికారి మాధవి, జిల్లా ఇంటర్మీడియట్ నోడల్ అధికారి కల్పన, మున్సిపల్ కమిషనర్లు, జడ్పీ సీఈవో కె.నరేందర్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.





గంజాయి పట్టివేత

కరీంనగర్ క్రైం, మార్చి 1: కరీంనగర్ ఎక్సైజ్ టాస్క్‌ఫో ర్స్ సీఐ కె నాగేశ్వర్‌రావు ఆధ్వర్యంలో శుక్రవారం భగత్‌నగర్‌లో నిర్వహించిన దాడుల్లో 535 గ్రాముల గంజాయి పట్టుబడింది. గంజాయిని కలిగి ఉన్న ముగ్గురు నిందితులు శాంతినగర్‌కు చెందిన ఆర్ శశికుమార్, పెగడపల్లికి చెందిన పి రామకృష్ణ, వరంగల్‌కు చెందిన బి జయంత్‌పై కేసులు నమోదు చేసి అరెస్టు చేవామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. పట్టుబడి నిందితుల వద్ద నుంచి గంజాయితోపాటు రెండు మొబైల్‌ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. గంజాయి కేసుల్లో అనుమానితులుగా ఉన్న మరో ముగ్గురిని అదుపులోకి తీసుకుని కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ స్టేషన్‌లో అప్పగించగా వారిని బైండోవర్ చేశామని ఎక్సైజ్ పోలీసులు తెలిపారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ హెడ్‌కానిస్టేబుల్ మోసిన్, కానిస్టేబుళ్లు కుమార్ యాదవ్, ఖాసీంబీ, కమలాకర్, కమాలుద్దీన్, సంతోష్ పాల్గొన్నారు.





డిగ్రీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం

గణేశ్‌నగర్, మార్చి 1: తెలంగాణ డిగ్రీ అండ్ పీజీ కళాశాలల మేనేజ్‌మెంట్ అసోసియేషన్ కార్యవర్గం శుక్రవారం హైదరాబాదులో ఏర్పాటైంది. అధ్యక్షుడిగా బొజ్జ సూర్యనారాయణ రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షులుగా శ్రీధర్ రావు, పరమేష్, ఉపాధ్యక్షులుగా నారాయణ గౌడ్, రవీంద్రనాథ్, ప్రధాన కార్యదర్శిగా యాద రామకృష్ణ, కోశాధికారిగా శంకర్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా భాస్కర్ రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పూర్వ అధ్యక్షులు ప్రకాష్, గింజల రమణారెడ్డి, సుందర్ రాజ్, కార్యదర్శులు హరిస్మరణరెడ్డి, విజయ భాస్కర్‌రెడ్డి, నరేందర్ రెడ్డి, రాష్ట్రంలోని అన్ని యూనివర్సిటీల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామకృష్ణ డిగ్రీ కాలేజీ కరస్పాండెంట్ యాదా రామకృష్ణ, ఉపాధ్యక్షుడు పెద్దపల్లి గాయత్రి కళాశాల కరస్పాండెంట్ యెల్లెంకి శ్రీనివాస్, తెలంగాణ ప్రైవేట్ డిగ్రీ, పీజీ కళాశాలల నిర్వహణ సభ్యులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదంలో చెరుకు పంట దగ్ధం

మెట్‌పల్లి రూరల్, మార్చి 1 : మండలంలోని సత్తక్కపల్లి గ్రామానికి చెందిన నల్ల విఠల్ అను చెరుకు రైతు పంట గురువారం రాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో పూర్తిగా దగ్ధమైంది. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామం లోని నల్ల వెంకటేశ్వర్లు చెరుకు పంట వద్ద పనులు ముగించుకుని ఇంటికి వచ్చాడు. రాత్రి సమయంలో చెరుకు పంటలో ఎగిసిపడుతున్న మంటలను గమనించిన స్థానికులు వెంటనే వెంకటేశ్వర్లుకు సమాచారం అందించారు. ఆయన వెంటనే అగ్ని మా పక సిబ్బందికి సమాచారం అందించి తోట వద్దకు వెళ్లాడు. మంటలను స్థానిక రైతులతో కలిసి ఆర్పే ప్రయత్నం చేశారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చేసరికి పంట పూర్తిగా కాలిపోయింది. ఈ ప్రమాదంలో రూ. 2లక్షలు ఆస్థి నష్టం వాట్లిందని వెంకటేశ్వర్లు అవేదనతో తెలిపాడు. జరిగిన ప్రమాదంపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సంఘటన స్థలాన్ని పోలీసులు పరిశీలించి ఎవరైనా అనుమాణితులు ఉంటే తెలపాలని సూచించారు. అగ్ని ప్రమాదం జరిగిందా ? ఎవరైనా కావాలని చేశారా అన్న కోణంలో దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదం

- గన్నేరువరంవాసి మృతి

నార్సింగ్, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): కోకాపేట్ గుట్టపై మూవీ టవర్స్ వద్ద గురువారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. కరీంనగర్ జిల్లా గన్నేవరం గ్రామానికి చెందిన మునిగంటి కరుణాకర్ (45) డీసీఎం డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. పని నిమిత్తం కోకాపేట్‌కు రాగా రోడ్డు దాటుతుండగా టిప్పర్ ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. నార్సింగ్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

మల్యాల, మార్చి 1: కరీంనగర్- జగిత్యాల మార్గంలోని రాజారం సమీపంలో శుక్రవారం ఎదురెదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు, ద్విచక్రవాహనం ఢీకొన్న సంఘటనలో తీవ్ర గాయాలతో ఒకరు మృతి చెందారు. కరీంనగర్ జిల్లా గంగాధర మండలం ర్యాలపల్లికి చెందిన తెట్టు ఎల్లయ్య(47) జగిత్యాల నుంచి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. దీంతో అతనికి తీవ్ర గాయాలు కావడంతో చికిత్స కోసం జగిత్యాల ఏరియా ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఆర్టీసీ బస్సు డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అబ్దుల్ రహీం తెలిపారు.











బాబ్లీ గేట్లు ఎత్తివేత

- దిగువ గోదావరిలోకి 0.6 టీఎంసీల నీటి విడుదల
- సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు అధికారులు చర్యలు


బాబ్లీ ప్రాజెక్టు గేట్ల ద్వారా దిగువకు విడుదల అవుతున్న నీరు

జగిత్యాల, మార్చి 1 (ఆంధ్రజ్యోతి): పొరుగున మహారాష్ట్రలో గల బాబ్లీ ప్రాజెక్టు గేట్లను శుక్రవారం అధికారులు తెరిచారు. ప్రాజెక్టు నుంచి 0.6 టీఎంసీల నీటిని గోదావరిలోకి విడుదల చేశారు. గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాల ప్రకారం తాగునీటి అవసరాల నిమిత్తం ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తున్నారు. మహారాష్ట్రలో గోదావరి నదిపై బాబ్లీ ప్రాజెక్టు నిర్మిస్తున్న సమయంలో ఇరు రాష్ట్రాల ప్రభుత్వాలు సుప్రీం కోర్టులో పిటిషన్లు వేయడంతో సంబంధిత ఉత్తర్వులు వచ్చాయి. దీని ప్రకారం ప్రతీ సంవత్సరం జూలై 1వ తేది నుంచి అక్టోబరు 29వ తేదీ వరకు బాబ్లీ నుంచి అధికారులు నీటిని విడుదల చేస్తుంటారు. అదే విధంగా వేసవిలో ఎదురయ్యే నీటి ఎద్దడిని ఎదుర్కోవడానికి మార్చి 1వ తేదీన ఒక రోజు పాటు నీటిని విడుదల చేస్తారు. ఈ మేరకు బాబ్లీ ప్రాజెక్టు గేట్లను ఎత్తి దిగువకు నీటిని వదులుతున్నారు. ఉదయం 9.30 గంటలకు 5 గేట్లను ఎత్తి నీటి విడుదలను ప్రారంభించారు. 0.6 టీఎంసీల నీరు విడుదల కాగానే తిరిగి గేట్లను మూసివేస్తారు. ఈ కార్యక్రమంలో పలువురు బాబ్లీ ప్రాజెక్టు, ఎస్సారెస్పీ అధికారులు, ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

4న ఉమ్మడి జిల్లా జూనియర్స్ హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలు

కరీంనగర్ స్పోర్ట్స్, మార్చి 1: ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా జూనియర్స్ బాలుర హ్యాండ్‌బాల్ జట్ల ఎంపిక పోటీలను నిర్వహించనున్నారు. జిల్లాలోని కొత్తపల్లి మండల పరిధిలోగల అకాడమి హైట్స్ పబ్లిక్ పాఠశాల మైదానంలో మధ్యాహ్నం మూడు గంటల నుంచి పోటీలను నిర్వహిస్తామని జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేష్ అధ్యక్ష, కార్యదర్శులు వీర్ల వెంకటేశ్వర్‌రావు, బసరవేని లక్ష్మణ్ తెలిపారు. ఈ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఈనెల 8 నుంచి 10 వరకు వరంగల్ జిల్లాలోని పైడిపల్లిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తిగల క్రీడాకారులు 01-01-2004 తరువాత జన్మించిన వారు సంబంధిత జనన ధ్రువీకరణ పత్రాలతో మైదానంలో పీఈటీ శ్రీధర్, జిల్లా సంఘం సంయుక్త కార్యదర్శి ఎన్ ప్రభాకర్, కోచ్ మూల వెంకటేష్‌కు రిపోర్టు చేయాలని సూచించారు.

11న జేఎల్ఎం సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్, మార్చి 1: టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించే ఆరో విడత జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను 11న సోమవారం ఉదయం 9 గంటల నుంచి నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ ఒక ప్రకటనలో తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి యొక్క చిరునామాలకు రిజిస్టర్ పోస్ట్ ద్వారా కాల్ లెటర్లు పంపించామన్నారు. జాబితాను నోటీసు బోర్డులో కూడా ఉంచామన్నారు. కాల్ లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో కాల్ లెటర్‌ను పొందవచ్చని తెలిపారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, స్తంభం ఎక్కించడం పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని తెలిపారు. జేఎల్ఎం అభ్యర్థులు ఎలాంటి ప్రలోభాలను నమ్మవద్దని కోరారు.

49మంది మందుబాబులకు జరిమానా

సిరిసిల్ల క్రైం, మార్చి 1: జిల్లాలోని ఎల్లారెడ్డిపేట, కోనరావుపేట పోలీస్‌స్టేషన్‌ల పరిధిలో డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 49 మంది మందుబాబులకు జరిమానా విధిస్తూ శుక్రవారం సిరిసిల్ల ఫస్ట్ అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి సృజన తీర్పు ఇచ్చారు. ఎల్లారెడ్డిపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో 20 రోజుల వ్యవధిలో నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 33 మంది మందుబాబులను కోర్టులో హాజరు పరిచారు. మెజిస్ట్రేట్ 8 మందికి రూ2 వేల జరిమానా, 25 మందికి రూ.1000 జరిమానా విధించారని ఎస్సై రమాకాంత్ తెలిపారు. అదేవిధంగా కోనరావుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో మద్యం తాగి వాహనాలు నడుపుతూ 20 రోజుల్లో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడిన 16 మందిని కోర్టులో హాజరుపరచగా తొమ్మిది మందికి రూ .2 వేలు, ఏడుగురికి రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్సై వివరించారు.

మూడు ద్విచక్రవాహనాలు దహనం


కాలిపోయిన వాహనాలు

తంగళ్లపల్లి, మార్చి 1: తంగళ్లపల్లి మండలం బద్దెనపల్లి గ్రామంలో ఇంటి ముందు నిలిపిన మూడు ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో దహనమయ్యాయి. పోలీసుల కథనం ప్రకారం.. శుక్రవారం తెల్లవారుజామున గుగ్గిళ్ల అంజనేయులు ఇంటి ముందు మూడు ద్విచక్రవాహనాలు పార్క్ చేశారు. తెల్లవారుజామున 2 గంటల ప్రాంతంల రామన్నపల్లెకు చెందిన గడ్డం సాయి ద్విచక్ర వాహనాలకు నిప్పు పెట్టడంతో కాలిపోయాయి. ఇంటి ముందు రేకులు, షెట్టర్, వీవోపీకి సైతం పెట్రోల్ చల్లడంతో మంటలు చేలరేగి కాలిపోయాయి. సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడు గడ్డం సాయికృష్ణను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కోరుట్ల రూరల్, మార్చి 1: మండలంలోని జోగినిపల్లి గ్రామానికి చెందిన పలికొండ నవీన్ (31) అనే యువకుడు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు శుక్రవారం ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. పోలీసులు, బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. నవీన్ తనకు పిల్లలు పుట్టడంలేదని కొంత కాలంగా మనస్తాపంతో ఉంటున్నాడు. దీంతో ఇంట్లో ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని అత్మహత్య చేసుకున్నాడు. నవీన్ తండ్రి దేవయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ లక్ష్యం

- రేవంత్‌కు, కేటీఆర్‌కు నక్కకు, నాగలోకానికి ఉన్న తేడా?
- కేటీఆర్‌కు దమ్ముంటే నిజామాబాద్ నుంచి పోటీ చేయాలి
- ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న జీవన్‌రెడ్డి

జగిత్యాల అర్బన్, మార్చి 1: ప్రజా సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ పార్టీ ప్రధాన ధ్యేయమని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరా భవన్‌లో శుక్రవారం విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ కేటీఆర్ సీఎం రేవంత్‌ను పదవికి రాజీనామా చేసి పార్లమెంట్ బరిలో నిలవాలని సవాలు చేయడం ఆయన అవివేకానికి నిదర్శనం అన్నారు. కేటీఆర్‌కు, రేవంత్‌కు నక్కకు నాగలోకానికి ఉన్న తేడా ఉందన్నారు. విమర్శించే ముందు ఆత్మవిమర్శ చేసుకొని మాట్లాడాలని హితవు పలికారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పరిస్థితి అధ్వానంగా మారిందని, కేటీఆర్ తీరుతో ఆఖరికి గెలుస్తదనే నమ్మకంతో ఉన్న మెదక్ సీటుకూడా గెలిచే పరిస్థితి లేకుండా పోయిందన్నారు. కేటీఆర్‌కు దమ్ముంటే కరీంనగర్, మెదక్, నిజామాబాద్ పార్లమెంట్ సెగ్మెంట్‌లలో పోటీ చేసి గెలవాలని జీవన్‌రెడ్డి సవాల్ విసిరారు. తుమ్మడి హెట్టి వద్ద 160టీఎంసీల నీరు లభ్యత ఉందని నివేదిక ఉండగా, అక్కడి నుంచి ప్రాజెక్టు నిర్మాణంను కిందికి దించేందుకు మరో నివేదికను తయారుచేశారన్నారు. తుమ్మడిహెట్టి వద్ద ప్రాజెక్టు నిర్మాణం చేపడితే ఒక్క లిఫ్టుతో ప్రాజెక్టుకు నీరు చేరేదన్నారు. మేడిగడ్డ పిల్లరు కుంగడం టెక్నికల్ లోపమని సమర్ధించుకోవడం విచారకరం అన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్‌కు ఓటేస్తే సంక్షేమ పథకాలు అందవని ప్రచారం చేశారని, ఆచరణకు సాధ్యం కాని హామీలు ఇచ్చారని దుష్ప్రచారం చేశారని గుర్తుచేశారు. కానీ ప్రజా ఆశీర్వాదంతో ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఆరు గ్యారంటీలను దశల వారీగ అమలు చేస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ అమలు చేసిన తొలి గ్యారంటీ ఉచిత బస్సు సౌకర్యం నూటికి నూరు శాతం విజయవంతం అయ్యిందని, గృహవినియోగదారులకు 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటును కూడా మార్చి ఒకటి నుంచి అమలు చేసిందన్నారు. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న వారందరికీ 200 యూనిట్ల ఉచిత విద్యుత్ వర్తిస్తుందని, దరఖాస్తు చేసుకోని, రేషన్‌కార్డు కలిగిన వారు స్థానిక మున్సిపల్, ఎంపీడీవో కార్యాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.500కే సిలిండర్ కార్యక్రమం అమలుతో పాటు, గృహ నిర్మాణం పథకం కూడా వారం రోజుల్లో ప్రకటన వెలువడే అవకాశం ఉందన్నారు. ఇండ్ల పంపిణీలో పారదర్శకత పాటించేలా చర్యలు గైకొంటామన్నారు. ప్రజాసంక్షేమమే పరమావధిగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతుందని ఇప్పటికైనా కేటీఆర్ స్థాయికి తగిన విధంగా మాట్లాడాలని హితవు పలికారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ నాయకులు గిరి నాగభూషణం, బండ శంకర్, కొత్తమోహన్, గాజుల రాజేందర్, సిరాజుద్దీన్ మన్సూర్, షేక్ చాంద్‌పాషా, జున్ను రాజేందర్, బీరం రాజేష్, మహిపాల్, బొల్లి శేఖర్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

జగిత్యాల రూరల్ మండలం హబ్సీపూర్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు, మాజీ ఏఎంసీ డైరెక్టర్ చెక్కపెల్లి మోహన్ రెడ్డి తో పాటు పలువురు నాయకులు టీఆర్ఎస్ పార్టీ నుంచి కాంగ్రెస్‌లో చేరారు. అలాగే సారంగాపూర్ మండలం పోచంపేట్ గ్రామానికి చెందిన బీఆర్ఎస్ మాజీ సర్పంచ్ పల్లికొండ రమేష్‌తో పాటు పలువురు గంగపుత్ర సంఘ నాయకులు సైతం కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాగా వీరికి కాంగ్రెస్ కండువా కప్పిన జీవన్‌రెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు.

వైభవంగా సీతారామాంజనేయస్వామి ప్రతిష్ఠాపనోత్సవం


స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

మెట్‌పల్లి రూరల్, మార్చి 1: మండలంలోని బండ లింగాపూర్ గ్రామంలో నూతనంగా నిర్మించిన సీతారామాంజనేయ ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్స వం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం ఉదయం నుంచి ఆలయంలో పుణ్యాహ వచనం గతస్థాపితార్చన, యంత్రమూర్తుల ప్రతిష్ఠాపన, నిత్యహోమం, జయాధి హో మం, ప్రాయశిత్తహోమం, బలిహరణ, పూర్ణాహుతి, కుంభాషేకం ప్రత్యేక పూజలు తదితర కార్యక్రమాలను పురోహితులు ఘనంగా జరిపారు. అనంతరం వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీతారాముల వారి కల్యాణం అంగరంగ వైభవంగా జ రిపించారు. మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నం మండలలోని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణం తిలకించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, భక్తులు, తదిత రులు పాల్గొన్నారు.

వాటర్ ట్యాంకర్‌ను ఢీకొన్న కారు

తిమ్మాపూర్, మార్చి1: కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని అలుగునూర్ వద్ద రాజీవ్ రహదారిపై శుక్రవారం ఉదయం మొక్కలకు నీరు పోస్తున్న వాటర్ ట్యాంకర్‌ను వెనకాల నుంచి అతివేగంగా వచ్చిన కారు ఢీకొంది. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం నుజ్జు నుజ్జు అయింది. కారులో బెలున్స్ తెరచుకోవడంతో అందులో ఉన్న వ్యక్తి ప్రమాదం నుంచి బయటపడాడు. కారులో మండలంలోని మహాత్మానగర్ గ్రామానికి చెందిన రాజేందర్ అనే వ్యక్తి ఉన్నట్లు స్థానికులు తెలిపారు. పోలీసులు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకున్నారు.

ట్రాలీ ఆటో బోల్తా.. ఒకిరికి గాయాలు

వీర్నపల్లి (ఎల్లారెడ్డిపేట), మార్చి 1: సిరిసిల్ల నుంచి ఎల్లారెడ్డిపేట వస్తున్న ఆటో పదిర సమీపంలోని వంతెన ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి బోల్తా పడింది. దీంతో డ్రైవర్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికుల వివరాల ప్రకారం.. ప్రధాన రహదారిపై ఉన్న గుంతలో పడి ఆటో బోల్తా కొట్టింది. ట్రాలీ ఆటోలో తన కుమారుడితో ఎల్లారెడ్డిపేట వైపు వస్తున్న నారాయణాపూర్ గ్రామానికి చెందిన మోతే దేవదాస్ గుంతలో పడి ఆటో బోల్తా పడడంతో తీవ్రంగా గాయపడ్డాడు. గమనించిన స్థానికులు డ్రైవర్ పైఉన్న ఆటోను పక్కకు జరిపి 108లో సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. వంతెనపై ప్రమాదకరంగా ఉన్న గుంతను పూడ్చాలని ఎన్నిసార్లు అధికారులకు విన్నవించిన పట్టించుకోవడం లేదని వాహనదారులు పేర్కొన్నారు. అధికారులు స్పందించి గుంతను పూడ్చి ప్రమాదాలను నివారించాలన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

వీణవంక, మార్చి 1: మండలంలోని చల్లూరు గ్రామ శివారు నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. మానకొండూరు మండ లం ఊటూరు గ్రామంలోని మానేరు వాగు నుంచి ఎలాంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్నట్లు గుర్తించామని, ఈ మేరకు కనుకుంట్ల శ్రీనివాస్ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్టు ఎస్సై వంశీకృష్ణ తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించారు.

సీజ్ చేసిన వాహనాలు వేలం వేస్తాం

- ప్రభుత్వానికి ఆదాయం కల్పించడమే ధ్యేయం
- డీటీసీ పెద్దింటి పురుషోత్తం


వాహనాల ఫిట్‌నెస్‌ను పరిశీలిస్తున్న డీటీసీ పెద్దింటి పురుషోత్తం

తిమ్మాపూర్, మార్చి1: రవాణా శాఖ కార్యాలయంలో ఎలాంటి పత్రాలు లేకపోవడంతో సీజ్ చేసిన వాహనాలను వేలం వేసి ప్రభుత్వానికి ఆదాయాన్ని సమకూరుస్తామని ఉమ్మడి కరీంనగర్ జిల్లా రవాణా శాఖ కమిషనర్ పెద్దింటి పురుషోత్తం అన్నారు. స్థానిక జిల్లా రవాణా శాఖ కార్యాలయ ఆవరణలో ఉన్న డ్రైవింగ్ ట్రాక్ సమీపంలో ఉన్న పాడుబడ్డ వాహనాలను, వాహనాలను ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ చేస్తున్న తీరును డీటీసీ పరిశీలించారు. ఈ సందర్భంగా సీజ్ చేసిన వాహనాల జాబితా తయారు చేసి వారం రోజుల్లోగా తనకు అందజేయాలని ఏఎంవీఐ స్రవంతిని ఆదేశించారు. కార్యాలయానికి ఫిట్‌నెస్, రిజిస్ట్రేషన్ కోసం వచ్చే భారీ వాహనాలు, ఆటోలకు నాణ్యమైనా రేడియం స్టిక్కర్లను ముందు, వెనుకాల కచ్చితంగా వేయించాలని వాహనదారులకు సూచించారు. స్టిక్కర్లు వేసుకోవడం వల్ల రాత్రి వేళల్లో ప్రమాదాలను నివారించవచ్చునని తెలిపారు. నిర్మాణం పూర్తయిన డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రజలకు త్వరలో అందుబాటులోకి తీసుకువస్తామన్నారు. డ్రైవింగ్ ట్రాక్ కు సంబంధించిన పెండింగ్ పనులపై ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణను కలిసి నిధులు సమకూర్చాలని కోరామని చెప్పారు. ఎమ్మెల్యే స్పందించి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి నిధులు సమాకూర్చే విధంగా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారని తెలిపారు. ప్రభుత్వం నుంచి నిధులు మంజూరు అయిన వెంటనే పెండింగ్‌లో ఉన్న పనులను చేపట్టి రాష్ట్ర రవాణా శాఖ మంత్రిచేత ఈ డ్రైవింగ్ ట్రాక్‌ను ప్రారంభించే విధంగా చర్యలు చేపడుతామని డీటీసీ తెలిపారు. కార్యక్రమంలో ఎంవీఐ రవికుమార్, ఏఎంవీఐ స్రవంతి, సిబ్బంది శ్రీనివాస్, రహూఫ్, గౌస్ పాష తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా మహాశివరాత్రి జాతర ఏర్పాట్లు

- చలువ పందిళ్లు సిద్ధం చేస్తున్న సిబ్బంది
- మూడు రోజుల పాటు నిర్వహణ


సిద్ధం చేస్తున్న పందిళ్లు

వేములవాడ, మార్చి 1: ప్రముఖ పుణ్యక్షేత్రమైన వేములవాడ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో మహాశివరాత్రి జాతర ఉత్సవాల ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. ఈనెల 7వ తేదీ నుంచి మార్చి 9 వ తేదీ వరకు మూడు రోజులపాటు నిర్వహించనున్న మహాశివరాత్రి జాతర ఉత్సవాల కోసం ఆలయ అధికారులు భారీ స్థాయిలో ఏర్పాటు చేస్తున్నారు. ప్రధాన ఆలయంతోపాటు అనుబంధ ఆలయాలకు, వసతి గదుల కాంప్లెక్స్‌లకు కొత్తగా రంగులు వేయడంతో పాటు క్యూలైన్ల క్రమబద్ధీకరణ, విద్యుత్ దీపాలతో అలంకరణ, చలువ పందిళ్ల, కలకత్తా పందిళ్ల ఏర్పాటు, శివార్చన వేదిక నిర్మాణం, తాత్కాలిక పార్కింగ్ లాట్స్ ఏర్పాటు, యాత్రికులకు తాగునీటి వసతి కోసం నల్లాల ఏర్పాటు, తాత్కాలిక మరుగుదొడ్ల ఏర్పాటు వంటి పనులు చురుగ్గా సాగుతున్నాయి. జాతర ప్రారంభం లోగా ఏర్పాట్లు పూర్తి చేస్తామని, జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు కలగకుండా చూస్తామని ఆలయ అధికారులు తెలిపారు.


రోడ్డు చదును చేస్తున్న సిబ్బంది

భూ కబ్జాలకు పాల్పడిన వ్యక్తిపై కేసు

సిరిసిల్ల క్రైం, మార్చి 1: భూ కబ్జాలకు పాల్పడిన పట్టణంలోని అంబేద్కర్‌నగర్‌కు చెందిన సిరిగిరి రమేశ్‌పై శుక్రవారం కేసు నమోదు చేసినట్లు వేముల వాడ డీఎస్పీ నాగేంద్రచారి తెలిపారు. వేములవాడ అర్బన్ పరిధిలోని తెట్టెకుంట పరిధిలో సర్వే నంబరు 6 లో గల 126 చదరపు గజాల స్థలాన్ని నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు సృష్టించి, తనను బెదిరించి ఆక్రమించేందుకు ప్రయత్నిం చాడని బాధితుడు కరీంనగర్‌కు చెందిన బెంజిమెన్ ఫిర్యాదు మేరకు. కేసు నమోదు చేశామని డీఎస్పీ తెలిపారు.

70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యం పట్టివేత

సుల్తానాబాద్, మార్చి 1: అక్రమ రవాణాకు సిద్ధంగా ఉన్న 70 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం పట్టుకున్నారు. సుల్తానాబాద్ మండలంలోని దేవునిపల్లి గ్రామంలో రవాణాకు సిద్ధంగా ఉన్న రెండు వ్యాన్‌లలో లోడ్ చేయబడి ఉన్న సబ్సిడీ బియ్యంకు సంబంధించిన సమాచారాన్ని అందుకున్న పోలీసులు వాటిని స్వాధీనం చేసుకున్నారు. ఈ అక్రమ రవాణాకు సంబంధించి దేవునిపల్లి గ్రామానికి చెందిన వారణాసి సమ్మయ్య ను అదుపులోకి తీసుకుని రెండు వ్యాన్లలో ఉన్న బియ్యంతో పాటు సుల్తానాబాద్ పోలీసులకు అప్పగించామని పోలీసులు తెలిపారు.

7న మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆత్మీయ సన్మానం


మాట్లాడుతున్న బీసీ సంఘాల ఐక్యవేదిక ప్రతినిధి వైద్యుల అంజన్‌కుమార్

గణేశ్‌నగర్, మార్చి 1: బీసీ కుల గణన చేయాలని అసెంబ్లీలో తీర్మానం ప్రవేశపెట్టిన రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ, రవాణా శాఖ మంత్రి ప్రభాకర్‌కు మహాత్మ జ్యోతిబాపూలే ఆశయ సాధనకు బీసీ కుల సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఈ నెల 7వ తేదీన నిర్వహించే అభినందన సభ, ఆత్మీయ సన్మాన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని బీసీ కుల సంఘాల ఐక్యవేదిక కన్వీనర్ వైద్యుల అంజన్‌కుమార్ పిలుపునిచ్చారు. శుక్రవారం కరీంనగర్ పట్టణంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ఫిబ్రవరి 27న బీసీ కుల సంఘాల ఐక్య వేదిక ఏర్పాటు చేశామన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే బీసీ కులగణన చేస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం అసెంబ్లీలో బీసీ కుల గణన తీర్మానం ప్రవేశ పెట్టారన్నారు. కృతజ్ఞతగా బీసీ కుల సంఘాల ఆధ్వర్యంలో మంత్రి పొన్నం ప్రభాకర్‌గౌడ్‌కు ఈనెల 7వ తేదీన గురువారం కరీంనగర్‌లోని ఇంద్ర గార్డెన్స్‌లో సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బీసీ నాయకులు, బీసీ సంఘాల నాయకులు, ప్రతినిధులు అధికసంఖ్యలో హాజరై కార్యక్రమం విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాజీ ఎమ్మెల్సీ సంతోష్‌కుమార్, బీసీ సంఘాల, కుల సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.

న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో లైవ్ సర్జరీలు


జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న వైద్యులు

సుభాష్‌నగర్, మార్చి 1: శాతవాహన న్యూరో డాక్టర్స్ అసొసియేషన్ ఆధ్వర్యంలో న్యూరో డాక్టర్ల రాష్ట్ర సదస్సులో శుక్రవారం లైవ్ సర్జరీలను నిర్వహించారు. నగరంలోని రెనే ఆసుపత్రిలో ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ సుకుమార్ సూర, డాక్టర్ మానస్ పాణిగ్రహి పాల్గొని అత్యాధునిక వైద్య విధానంతో మెదడులోని కంతిని తొలగించారని సదస్సు కమిటీ చైర్మన్ డాక్టర్ రమణారెడ్డి, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ జొన్నల శ్రీనివాస్, సైంటిఫిక్ కమిటీ చైర్‌పర్సన్ డాక్టర్ పీవీకే కిషోర్ తెలిపారు. లైవ్‌లో వివరిస్తూ ఆపరేషన్‌ను విజయవంతంగా నిర్వహించారని చెప్పారు. ఈనెల 2న నగరంలోని వి కన్వెన్షన్‌లో సాయంత్రం ప్రారంభోత్సవ కార్యక్రమం ఉంటుందని, ఈ కార్యక్రమానికి రాష్ట్ర రవాణ, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

సంతానసాఫల్య కేంద్రం డాక్టర్‌పై కేసు నమోదు

కరీంనగర్ క్రైం, మార్చి 1: సంతానం కోసం వైద్య చికిత్సలు పొందేందుకు ఒక మహిళ కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతాన సాఫల్య కేంద్రం ఆసుపత్రికి వెళితే డబ్బులు తీసుకుని చికిత్స అందించకుండా బెదిరించారని వచ్చిన ఫిర్యాదుతో డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం డాక్టర్ పద్మజతోపాటు ఆసుపత్రి సిబ్బందిపై కేసు నమోదు చేశామని రెండో టాణా సీఐ ఓ వెంకటేష్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. పశ్చిమ గోదావరి జిల్లా మొగల్తూరు మండలం పేరుపాలెం సౌత్ గ్రామానికి చెందిన తిరుమణి నాగలక్ష్మి అనే మహిళ సంతానం లేకపోవటంతో కరీంనగర్‌లోని డాక్టర్ పద్మజ సంతానసాఫల్య కేంద్రం ఆసుపత్రిలో సంప్రదించింది. సంతానం కలిగేందుకు చికిత్సకోసం డాక్టర్ పద్మజ, ఆసుపత్రి సిబ్బంది కలిసి ఆమె వద్ద ఐదు లక్షల రూపాయలు తీసుకున్నారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. చికిత్స అందించకుండానే మరో 80 వేల రూపాయలు చెల్లించాలని ఆసుపత్రి సిబ్బంది అడిగారని, చికిత్స చేయకుండా మళ్లీ డబ్బులు ఎలా ఇస్తామని అడగగా డాక్టర్‌తోపాటు సిబ్బంది తనను, తన భర్తను దూషించారని బాధితురాలు ఫిర్యాదులో పేర్కొంది. ఆసుపత్రిలో బంధించి, చంపుతామని బెదిరించినట్లు ఫిర్యాదు చేసిందని పోలీసులు తెలిపారు. ఈ మేరకు డాక్టర్ పద్మజ, సిబ్బందిపై కేసు నమోదు చేవామని సీఐ ఓ వెంకటేష్ తెలిపారు.

మార్టిగేజ్ చేసిన భూమి మరొకరికి విక్రయం

- మోసగించిన దంపతుల అరెస్టు - 14 రోజుల పాటు రిమాండ్


నిందితులను జైలుకు తరలిస్తున్న ఎస్సై

కరీంనగర్ క్రైం/గంగాధర, మార్చి 1: భూమిని మార్టిగేజ్ చేసి మరొకరికి విక్రయించిన దంపతులపై కేసు నమోదైంది. ఒక వ్యాపారి నుంచి 56 లక్షల రూపాయల డబ్బులు అప్పుగా తీసుకుని, హామీగా 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మార్టిగేజ్ చేశారు. దంపతులు తిరిగి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలు సృష్టించి మరొకరికి విక్రయించారు. ఈ మేరకు దంపతులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఎస్సై అభిలాష్ తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని గంధీరోడ్‌కు చెందిన సింగిరెడ్డి మోహన్‌రెడ్డి అనే వ్యాపారి వద్ద నుంచి గంగాధర మండలం హిమ్మత్‌నగర్‌కు చెందిన మూల కనకయ్య 2016లో 30 లక్షల రూపాయలు, 2017లో మరో 26 లక్షలు అప్పుగా తీసుకున్నాడు. హామీగా మూల కనకయ్య, అతని భార్య మూల మంజుల పేరిట ఉప్పర మల్యాలలో ఉన్న 3 ఎకరాల తొమ్మిదిన్నర గుంటల భూమిని మోహన్‌రెడ్డి పేరిట మార్టిగేజ్ చేశారు. రెండు బ్యాంక్ చెక్‌లను కూడా ఇచ్చారు. ఈ విషయాన్ని దాచిపెట్టి అదే భూమికి నకిలీ ధ్రువపత్రాలను సృష్టించి ఇతర వ్యక్తులకు విక్రయించారని బాధితుడికి తెలిసి వారిని నిలదీశారు. దీంతో చంపుతానని బెదిరించినట్లు బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు గురువారం కేసు నమోదు చేసి, విచారణ జరిపిన గంగాధర పోలీసులు బాధితుడి ఫిర్యాదులో పేర్కొన్న విషయాలు నిజమేనని వెల్లడైంది. దీంతో దంపతులను శుక్రవారం అరెస్టు చేసి కరీంనగర్ కోర్టులో హాజరు పరిచారు. మేజిస్ట్రేట్ నిందితులకు 14 రోజుల రిమాండ్ విధించారని, కరీంనగర్ జిల్లా జైలుకు తరలించామని పోలీసులు తెలిపారు.

అద్దకం కార్మికుడి అనుమానాస్పద మృతి

సిరిసిల్ల క్రైం, మార్చి 1: సిరిసిల్ల పట్టణంలోని సుభాష్‌నగర్‌లో నాగుల శ్రీకాంత్(36) అనే అద్దకం కార్మికుడు శుక్రవారం అనుమానాస్పద స్థితిలో మృతిచెందాడు. టౌన్ సీఐ రఘుపతి వివరాల ప్రకారం.... సుభాష్‌నగర్‌కు చెందిన శ్రీకాంత్ అద్దకం కార్మికుడిగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శ్రీకాంత్, లావణ్య దంపతులకు 14ఏళ్ల క్రితం వివాహమైంది. అతడికి భార్య లావణ్య, కుమారుడు, కూతురులు ఉన్నారు. భార్య, భర్తలిద్దరు ఇంట్లోనే ఉన్నారు. భార్య ఇంట్లో ముందు గదిలో బీడీలు చేస్తుండగా శ్రీకాంత్ బెడ్‌రూంలోకి వెళ్లాడని, ఏదో చప్పుడు వినిపించడంతో వెళ్లి చూడగా ఉరివేసుకొని ఉన్నట్లు చూసి వెంటనే చుట్టుపక్కల వారికి సమాచారం అందించి చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని భార్య లావణ్య చెబుతోంది. అప్పటికే శ్రీకాంత్ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య, భర్తల మధ్య తరుచూ గొడవలుజరగుతున్నాయని, మద్యానికి బానిసైన శ్రీకాంత్ మృతిపై అనుమానాలు ఉన్నాయని శ్రీకాంత్ తల్లి సులోచన పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ రఘుపతి తెలిపారు.

పెళ్లి ఇష్టం లేక యువతి ఆత్మహత్య

కొడిమ్యాల, మార్చి 1: మండలంలోని తిప్పయ్యపల్లి గ్రామానికి చెందిన కోల జమున(22)పెళ్లి ఇష్టం లేక శుక్రవారం సాయంత్రం ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్సై ఎస్. సందీప్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల మేరకు వివాహం చేయటానికి తల్లిదండ్రులు సంబంధాలు చూస్తున్నారు. వివాహం చేసుకోవటం ఇష్టం లేక జీవితంపై విసిగి పోయి ఇంటిలో చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. వెంటనే ఆమెను ఆమెను వేములవాడ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మృతురాలి తల్లి కోల భాగ్యమ్మ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలకు పుస్తకాల వితరణ

సుల్తానాబాద్, మార్చి 1: సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పూసాల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల గ్రంధాలయానికి ఇ కే అధ్యాత్మిక సేవా సంస్థ వారు పుస్తకాలను అందజేశారు. పిల్లల్లో పుస్తక పఠనంను ప్రోత్సాహించాలన్న ఉద్ధేశ్యంతో పుస్తకాలను వితరణ చేసినట్టు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాస్ రెడ్డి పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిత్యావసర వస్తువుల అందజేత

రామగిరి, మార్చి 1: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బత్తిని నర్సయ్య అనే డయాలసిస్ పేషంట్‌కు మాజీ జడ్పీటీసీ గంట వెంకటరమణ రెడ్డి ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ డైరెక్టర్ శరణ్యమారుతీయాదవ్, బెల్లం శ్రీనివాస్ నిత్యావసర వస్తువులను కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సభ్యులు కళాధర్‌రెడ్డి, తీగల శ్రీధర్, నవీన్‌లు పాల్గొన్నారు.

టీబీ వ్యాధిపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దపల్లి రూరల్, మార్చి 1 : టీబీ వ్యాధిపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దబోంకూర్ మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాలలో టిబి వ్యాధిపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్ హాజరై పలు అంశాలపై వివరించారు. ఈ కార్యక్ర మంలో రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ కావేటి రాజగోపాల్, రమేష్, శ్రీనివాస్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు ప్రభుత్వం అండ

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్





చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

కళ్యాణ్‌నగర్, మార్చి 1: పేదింటి ఆడపడుచులకు అండ కాంగ్రెస్ ప్రభుత్వమని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని గాంధీనగర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో76మంది లబ్ధిదారులకు రూ.76.08లక్షల కళ్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ ప్రకారం త్వరలోనే కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకం క్రింద రూ.లక్షతో పాటు తులం బం గారం అందజేయడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్యాచరణ రూపొం దిస్తున్నారని చెప్పారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం అనేక మోసపూరిత హామీలను ఇచ్చి ప్రజలను తప్పుదోవ పట్టించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వారం రోజుల్లోనే మహాలక్ష్మి, ఆరోగ్యశ్రీ, గృహ జ్యోతి, రూ.500లకే గ్యాస్ సిలీండర్ పథకాలను అమలు చేసిందన్నారు. మిగతా రెండు పథకాలను త్వరలోనే అందజేయనున్నట్టు ఆయన చెప్పా రు. అనంతరం లబ్ధిదారులతో సహపంక్తి భోజనం చేశారు. ఈ కార్యక్ర మంలో మేయర్ బంగి అనీల్‌కుమార్, కార్పొరేటర్లు బొంతల రాజేష్, మహంకాళి స్వామి, ఎండీ ముస్తాఫా, నాయకులు పెద్దెల్లి ప్రకాష్, తిప్పార పు శ్రీనివాస్, మాలెం మధు, నెలకంటి రాము, గట్ల రమేష్ పాల్గొన్నారు.

ధర్మారం, మార్చి 1 : గ్రామీణ నిరుపేద ప్రజలకు ప్రభుత్వ పథకాల ను అందించుటకు ప్రభుత్వ కృషి చేస్తోందని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. శుక్రవారం ధర్మారం మండల పరిషత్ కార్యాలయంలో కల్యాణలక్ష్మి చెక్కులను ఆయన పంపిణీ చేశా రు. ప్రభుత్వం అమలుచేస్తున్న పథకాలను ప్రజలు సద్వినియోగం చేసు కోవాలని కోరారు. 78మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేయగా, తహసీల్దార్ ఏ.రజిత, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా ఆస్తి పన్ను వసూళ్లు

- నిమగ్నమైన అధికారులు, సిబ్బంది



ఆస్తి పన్ను వసూళ్లలో పాల్గొన్న కమిషనర్, మేనేజర్(ఫైల్)

పెద్దపల్లిటౌన్, మార్చి 1: పెద్దపల్లి పట్టణంలో ఆస్తి పన్ను వసూళ్లలో మున్సి పల్ అధికారులు, సిబ్బంది నిమగ్నమయ్యారు. ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి వసూలు చేస్తున్నారు. మొండి బకాయిలపై నోటీసులు జారీ చేస్తూ కొరడా ఝుళిపిస్తున్నారు. పెద్దపల్లి పట్టణంతోపాటు విలీన గ్రామాలైన చందపల్లి, రం గంపల్లి, బంధంపల్లిలను కలుపుకొని మొత్తం 11,533 ఇళ్లుఉన్నాయి. 2023-24 సంవత్సరానికి 4కోట్ల 92లక్షల 60వేల రూపాయల డిమాండ్ ఉంది. ఇవి కాకుం డా ప్రభుత్వ కార్యాలయాలు 97ఉన్నాయి. కోటి 52లక్షల 54 వేల రూపాయలు ప్రభుత్వం మున్సిపాల్టీకి చెల్లించాల్సి ఉంది. అయితే ఆస్తి పన్ను మొత్తం నుంచి ఇప్పటికే 64 శాతం వసూల్ చేశారు. 3కోట్ల 15లక్షల 12వేల రూపాయలు ఫిబ్ర వరి నెలాఖరుకల్లా వసూలు చేశారు. ఇంకా కోటి 77లక్షల 48వేల రూపాయలు వసూల్ చేయాల్సి ఉంది. ప్రభుత్వ కార్యాలయాల బకాయిల మొత్తం కోటి 63 లక్షల 29వేల నుంచి ఇప్పటివరకు 10లక్షల75వేల రూపాయలు వసూల్‌చేశారు. అయితే మొండి బకాయిలను వసూల్ చేసేందుకు ప్రభుత్వ ఆదేశాలతో జరి మానాపై 90శాతం రాయితీ ప్రకటించారు. దీంతో మాఫీ పోను కోటీ 17 లక్షల రూపాయలు బకాయి ఉంది. ప్రభుత్వ కార్యాలయాలకు సైతం రాయితీ పోను 70 లక్షల రూపాయలు చెల్లించాల్సి ఉంటుంది. గత ఏడాదికంటే ఈ ఏడాది 637 ఇళ్లు నూతనంగా నిర్మించబడ్డాయి. దీంతో మున్సిపాలిటీకి ఆదాయం మ రింత పెరిగిందని అధికారులు చెబుతున్నారు.

ఆస్తి పన్ను చెల్లింపునకు సహకరించాలి

- ఆకుల వెంకటేష్, మున్సిపల్ కమిషనర్



పెద్దపల్లి మున్సిపల్ పరిధిలోని ప్రజలు ఆస్తి పన్నును సకాలంలో చెల్లించి పట్టణాభివృద్ధి సహకరించాలి. 2022-23 సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై వేసిన జరిమానా నుంచి 90శాతం రాయితీ ఇస్తున్నాం. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

తాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

పెద్దపల్లిటౌన్, మార్చి 1: వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు చేపడుతామని కమిషనర్ ఆకుల వెంకటేష్ తెలిపారు. శుక్రవారం పెద్దపల్లి పట్టణంలోని మున్సిపల్ సంబంధించిన బావులను ఏఈ సతీష్, సిబ్బందితో కలిసి పరిశీలించారు. అనంతరం కమిషనర్ మాట్లాడుతూ పెద్దపల్లి పట్టణంలోని రం గంపల్లి, తాళ్లకుంట, శాంతినగర్, పెద్దమ్మనగర్ తదితర ప్రాంతాల్లో ఉన్న మున్సిపల్ బావుల్లో బ్లీచింగ్ పౌడర్ శుద్ధి చేసి పరిశుభ్రమైన తాగునీటిని పట్టణ ప్రజలకు అందించాలని సూచించారు. అలాగే మిషన్ భగీరథ లీకేజ్ పనులను సత్వరమే మరమత్తులు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. తాగునీటి సమస్య ను తమ దృష్టికి తీసుకువస్తే వెంటనే పరిష్కరిస్తామన్నారు.

ప్రభుత్వాసుపత్రిలో పండ్లు పంపిణీ

కళ్యాణ్‌నగర్, మార్చి 1: బీజేపీ మాజీ అధ్యక్షుడు, దివంగత బంగారు లక్ష్మణ్ వర్థంతి సందర్భంగా గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం బీజేపీ నాయకులు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా బీజేపీ నాయకులు పెద్దపల్లి రవీందర్ హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట ఉపాధ్యక్షుడు కాసిపేట శివాజీ, నాయకులు అయోధ్య రవీందర్, మూకిరి రాజు, జక్కుల నరహరి, సుధాకర్, మాతంగి రేణుక, కొమ్ము శ్రీనివాస్, ముష్కె సంపత్, మచ్చ విశ్వాస్, సంతోష్, మల్లయ్య, రాజేష్, శ్రీకాంత్, భరత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

● కోల్‌సిటీ : రామగుండ నగరాభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీతో పాటు వివిధ పథకాల ద్వారా నిధులు మంజూరు చేసినందుకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం నగరపాలక సంస్థ కార్యా లయం ఎదుట క్షీరాభిషేకం చేశారు. మేయర్ బంగి అనీల్ కుమార్, బీఆర్ఎస్, కాంగ్రెస్ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

● కాల్వశ్రీరాంపూర్ : మండల కేంద్రంలో సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి శ్రీధర్‌బాబు, ఎమ్మెల్యే విజయరమణరావు చిత్రపటాలకు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ యూత్ మండల అధ్యక్షుడు సొన్నాయిటెంకం శివరామకృష్ణ మహిళలతో కలిసి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పులి ఇంద్రకరణ్‌రెడ్డి, కొంతం మధుకర్, వెంకటేష్ పాల్గొన్నారు.

● సుల్తానాబాద్: గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను తప్ప నిసరిగా వేయించాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని కాట్నపల్లిలో శుక్రవారం గాలికుం టు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెలాఖరు వరకు జిల్లా వ్యాప్తంగా టీకాల కార్యక్రమాన్ని కొనసాగిస్తామన్నారు.

● ఎలిగేడు : గాలికుంటు వ్యాధి టీకాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు ఝాన్సీ తెలిపారు. మండలంలోని ముప్పిరితోటలో శుక్రవారం 152పశువులు గేదెలకు ఉచితంగా గాలికుంటు వ్యాధిటీకాలను వేశారు. పశుమిత్ర సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

● సుల్తానాబాద్ : రాష్ట్రం ప్రభుత్వం పెంచిన వేతనాలను మున్సిపాలిటీలో అమలుచేయాలని కోరుతూ సీఐటీయూ జిల్లా కార్యదర్శి ముత్యంరావు ఆధ్వర్యంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మిరాజమల్లుకు వినతి పత్రం అందజేశారు. మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షు డు పాక మహేష్, మల్లేష్, రమేష్, బాబు, నరసింగం, పాల్గొన్నారు.

● కోల్‌సిటీ : రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో శుక్రవారం స్వచ్ఛ భారత్ కార్యక్రమం నిర్వహించారు. డిప్యూటీ కమిషనర్ త్రియంబకేశ్వర్‌రావు, ఎస్ఈ చిన్నారావు, సెక్రటరీ రాజు, అసిస్టెంట్ కమిషనర్ రాయలిం గు, సూపరింటెండెంట్ మనోహర్‌రావు, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ మధుకర్, రెవె న్యూ ఇన్‌స్పెక్టర్ శంకర్‌రావు పాల్గొన్నారు.

● ఓదెల : మండలంలోని భాయమ్మపల్లి, ఇందుర్తి గ్రామాల్లో అంతర్గత సీసీరోడ్ల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శంకుస్థాపన చేశారు. ప్రేంసాగర్‌రెడ్డి, సుమన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వేసవిలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు

- పెద్దపల్లి ఎమ్మెల్యే విజయరమణారావు



ఆధార్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

సుల్తానాబాద్, మార్చి 1: సుల్తానాబాద్ పట్టణ ప్రజలకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు కలగకుండా శాశ్వత ప్రాతిపదికన పనులు చేపట్టడం జరుగుతుందని ఎమ్మెల్యే ఇందుకు రూ.11కోట్లతో అమృత్ నిధులు అందుబాటులో ఉన్నాయని విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ తహసీల్దార్ కార్యాలయం ప్రాంగణంలో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రాన్ని శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత పాలకుల హయాంలో ఇతర ప్రాంతాలకు తరలిపోయిన ప్రభుత్వ కార్యాలయాన్నింటినీ మళ్లీ సుల్తానాబాద్‌లో ఏర్పాటు చేయిస్తామన్నారు. ఈ వేసవిలో పట్టణ ప్రజలకు తాగునీటి సమస్య లేకుండా చర్యలు తీసు కుంటున్నామని, గతంలో మాదిరిగా మానేరు నుంచి నీటి సరఫరా కొనసాగుతుందని, దాంతో పాటు మిషన్ భగీరథ పథకం ద్వారా కూడా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఆధార్ కేంద్రాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మీరాజమల్లు, వైస్‌చైర్‌పర్సన్ బిరుదు సమతక్రిష్ణ, జడ్పీటీసీ మినుపాల స్వరూప ప్రకాష్‌రావు, తహసీల్దార్ మధుసూదన్‌రెడ్డి, కమిష నర్ వేణుమాదవ్, నాయకులు పన్నాల రాములు, కౌన్సిలర్లు రాజయ్య, నిషాత్ రఫీ, ఎంపీటీసీ పులిఅనూష తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో పని చేయాలి : ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

అంతర్గాం, మార్చి 1: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసి గ్రామాలను అభివృద్ధి పథం వైపు నడిపించాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శనివారం అంతర్గాం మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం త్వరలోనే ఆరు గ్యారంటీలను అమలు చేయనున్నట్టు పేర్కొన్నారు. ఎల్లంపల్లి వద్ద నిర్మిస్తున్న ఎత్తిపోతల పథకం ద్వారా త్వరలో అంతర్గాం, పాలకుర్తి మండలాల రైతులకు సాగునీరు అందించనున్నట్టు పేర్కొన్నారు. పెద్ద ఎత్తున ప్రభుత్వ నిధులు వెచ్చించి రామగుండం నియోజకవర్గాన్ని సమగ్రంగా అభివృద్ధి పర్చనున్నట్టు పేర్కొన్నారు. ఎంపీపీ దుర్గం విజయ, తహసీల్దార్ పీ రాంమోహన్‌రావు, ఎంపీడీఓ ఎంఏ వలీం, వైస్ ఎంపీపీ మట్ట లక్ష్మి, ఎంపీటీసీలు కే రమేష్, ఎం శ్రీనివాస్, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు దివాకర్, ప్రత్యేక అధికారులు, అధికారులు పాల్గొన్నారు.

'భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాం'

పెద్దపల్లిటౌన్, మార్చి 1 : పెద్దపల్లి పాయింట్ నుంచి మేడారం సమ్మ క్క-సారలమ్మ జాతరకు భక్తులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చా మని కోరుట్ల, జగిత్యాల ఆర్టీసి డిపో మేనేజర్లు విజయ మాధురి, సునీత తెలిపారు. పెద్దపల్లి బస్టాండులో శుక్రవారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ జాతర దృష్ట్యా పెద్దపల్లి పాయింట్ ద్వారా 180బస్సుల్లో ప్రయాణికులను తరలించగా కోటి 99లక్షల 56వేల 200 రూపాయల ఆదాయం సమకూరిందన్నారు. ఈ సమావేశంలో స్టేషన్ మేనేజర్ కెఆర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

నీటి శుద్ధి కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

అంతర్గాం, మార్చి 1: మండల పరిధిలోని కుందనపల్లిలో ఎన్‌టీపీసీ సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా రూ.14లక్షలతో నిర్మించిన శుద్ధి కేంద్రాన్ని శనివారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ప్రారంభించారు. అదేవిధంగా రామగుండం కార్పొరేషన్ పరిధి 20వ డివిజన్ ఏరియాలో జీరో పాయిం ట్ నుంచి మల్యాలపల్లి శివారు రాజీవ్ రహదారి వరకు రూ.26లక్షల సీఎస్ఆర్ సీడీ నిధులతో నిర్మించ తలపెట్టిన బీటీ రోడ్డు పనులను ఎమ్మెల్యే ప్రారంభించారు.

ఈ కర్యాక్రమంలో ఎన్‌టీపీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కేదార్ రంజన్ పాండ్, కార్పొరేటర్ కన్నూరి సతీష్‌కుమార్ పలువురు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన

కాల్వశ్రీరాంపూర్, మార్చి 1: చిన్నతరాత్‌పల్లిలో ఉపాధి హామీ పథకం నిధులు రూ.5లక్షలతో, తారుపెల్లిలో రూ.5 లక్షలతో సీసీరోడ్లను, సీడీఎఫ్ నిధులు రూ.10లక్షతో నిర్మించనున్న యాదవ కమిటీ హాల్‌కు ఎమ్మెల్యే చింతకుంట విజయరమణరావు శుక్రవారం శంకుస్థాపన చేశారు. కిష్టంపేట, మీర్జంపేట గ్రామాల్లో రూ.10లక్షల సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేశా రు. జడ్పీటీసీ వంగల తిరుపతిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు గాజనవేన సదయ్య, ఎంపీటీసీలు రావి సదానందం, జనార్దన్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

మహిళలు స్వయం సాధికారత సాధించాలి

రామగిరి, మార్చి 1: మండలంలోని రత్నాపూర్ రైతువేదికలో రామగిరి ఖిల్లా, సింగరేణి సంయుక్తంగా నిర్వహించిన సేంద్రీయ పద్ధతిలో పండ్లు, కూరగాయల సాగు అనే అంశంపై ఏర్పాటుచేసిన సమావేశానికి ఉద్యాన విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ నీరజప్రభాకర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎంపీపీ ఆరెల్లి దేవక్క, సింగరేణి కాలరీస్ ట్రైనింగ్ మేనేజర్ మల్లారెడ్డి, జడ్పీటీసీ మ్యాదరవేని శారద, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.



వీకేపీ గనిలో ప్రమాదం

య్జైటింక్లయిన్‌కాలనీ, మార్చి 1: ఆర్జీ-2 పరిధిలోని వకీల్‌పల్లె గనిలో శుక్రవారం జరిగిన ప్రమాదంలో వినయ్‌రెడ్డి అనే కార్మికుడు గాయపడ్డాడు. తెల్లవారుజామున గనిలోని 74వ లెవల్ 40 డిప్ 3వ సిమ్ కంటిన్యూయస్‌మైనర్ సెక్షన్‌లో సైడ్ ఫాల్ జరిగింది. ఘటనాస్థలంలో పని చేస్తున్న జనరల్ మజ్దూర్ వినయ్‌రెడ్డిపై బొగ్గు పొరలు పడడంతో గాయపడ్డాడు. వినయ్‌రెడ్డిని కరీంనగర్‌కు తరలించారు.

ఆర్జీ-3లో 141 శాతం, ఏపీఏలో 108 శాతం ఉత్పత్తి

రామగిరి, మార్చి 1: సింగరేణి సంస్థ ఆర్జీ-3లో 141 శాతం, ఏపీఏలో 108 శాతం మాసాంతపు ఉత్పత్తి లక్ష్యాలను సాధించినట్లు ఆర్జీ-3, ఏపిఏ జీఎంలు సుధాకర్‌రావు, వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్జీ-3 ఏరియాకు నిర్దేశించిన 4.80లక్షల టన్నులకు గాను 6.78లక్షల టన్నులు సాధించి 141 శాతంలోను, ఏపీఏలో నిర్దేశించిన 1.27 లక్షల టన్నులకు 1.37 లక్షల టన్నులు సాధించి 108 శాతంలో నిలిచాయని పేర్కొన్నారు.

ఆర్జీ-3లో క్వార్టర్స్ కౌన్సెలింగ్

రామగిరి, మార్చి 1: సింగరేణి సంస్థ ఆర్జీ3, ఏపిఏ డివిజన్ పరిధిలోని ఎస్అండ్‌పీసీ కార్యాలయంలో శుక్రవారం క్వార్టర్స్ కౌన్సెలింగ్ చేపట్టారు. 207ఖాళీల క్వార్టర్స్ ఉండగా ఫ్రెష్, చేంజ్ ఆఫ్ క్వార్టర్స్ కొరకు 127 దరఖాస్తులు చేసుకున్నారు. అందులో 37మంది కౌన్సిలింగ్‌కు హాజరుకాగా 33మంది క్వార్టర్స్‌ను ఎంపిక చేసుకున్నారు. ఇన్‌చార్జి ఎస్ఓటూ జీఎం వెంకటరమణ, అధికారులు గుర్రంశ్రీహరి, సునీల్‌ప్రసాద్, నాయకులు రామచంద్రరెడ్డి, రవీందర్‌రెడ్డి, మహేందర్, సుధాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

బొగ్గు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించాలి : సీఎండీ

గోదావరిఖని, మార్చి 1: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం బొగ్గు ఉత్పత్తి లక్ష్యం 70మిలియన్ టన్నులు మార్చి 31తేది నాటికి అధిగమించాలని సీఎండీ బలరాం అన్నారు. శుక్రవారం సింగరేణి భవన్‌లో అన్నీ ఏరియాల జీఎంలతో ఆయన ప్రత్యక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎండీ ఉత్పత్తి, రవాణాపై జీఎంలకు నిర్దేశన చేశారు. మార్చినెల రోజుకు కనీసం 2.35లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలని, రవాణా కూడా అదే స్థాయిలో జరగాలని జీఎంలకు సూచించారు. తద్వారా ఈ మాసాంతానికల్లా 70మిలియన్ టన్నుల వార్షిక లక్ష్యాన్ని అధిగమిస్తామన్నారు. లక్ష్య సాధనకుగల ఇబ్బందులను డైరెక్టర్ల సమావేశంలో చర్చించి పరిష్కార మార్గాల ద్వారా చర్యలు తీసుకోవాలన్నారు. ఓసీ కాంట్రాక్టర్‌తో కూడా సమీక్షించి సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. సమావేశంలో డైరెక్టర్(ఈఅండ్ఎం) సత్యనారాయణరావు, డైరెక్టర్(ఆపరేషన్, పర్సనల్) ఎన్‌వీకే శ్రీనివాస్, డైరెక్టర్(పీపీ) వెంకటేశ్వర్‌రెడ్డి, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(మార్కెటింగ్) అల్విన్, జీఎం(కోఆర్డినేషన్) ఎం సురేష్, జీఎం (సీపీపీ) జే సురేష్, జనరల్ మేనేజర్(ఎన్విరాన్‌మెంట్) జేవీఎల్ గణపతి, జీఎం(మార్కెటింగ్) దేవేందర్, జీఎం(పీపీ) సాయిబాబా, జీఎం(ఓసీ మైన్స్) సూర్యనారాయణరాజు, జీఎం (సీహెచ్‌పీఎస్) నవీన్‌కుమార్‌తో పాటు కార్పొరేట్ అధికారులు, జీఎంలు పాల్గొన్నారు.

జీఎం ఆఫీస్ ఎదుట సీఐటీయూ ధర్నా

గోదావరిఖని, మార్చి 1: రామగుండం రీజియన్‌లో కార్మిక కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలంటూ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్‌జీ-1 జీఎం కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం జీఎం పర్సనల్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం అందజేశారు. సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, కార్యదర్శి మెండె శ్రీనివాస్, రాజమౌళి, మహేష్, గౌస్, శంకరన్న, రాములు, తిప్పారపు రాజు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షకు 94.52 శాతం హాజరు

పెద్దపల్లి కల్చరల్, మార్చి 1: జిల్లాలో ఇంటర్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. ఇంటర్ ప్రథమ సంవత్సరం ఇంగ్లీష్ పేపర్-1 పరీక్ష జరగగా 5,177మంది పరీక్షకు హాజరుకాగా, 300 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జనరల్, వొకేషనల్ కలిపి జిల్లాలో 5,477 మంది ఇంటర్ ప్రథమ సంవత్సరం పరీక్ష రాయాల్సి ఉండగా, జనరల్ అభ్యర్థులు 4,331 మందికి 4,138 మంది హాజరుకాగా, 193 మంది గైర్హాజరు అయ్యారు. అలాగే వొకేషనల్ 1,146 మందికి 1,039 మంది హాజరుకాగా 107 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారని అధికారులు తెలిపారు. జిల్లాలో 94.52శాతం హాజరయ్యారని, ఎలాంటి మాల్‌ప్రాక్టీస్ కేసు నమోదు కాలేదని ఇంటర్మీడియేట్ జిల్లా అధికారి కల్పన ఒక ప్రకటనలో తెలిపారు.

సీసీ రోడ్డుపై మట్టిని తొలిగించిన అధికారులు

'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందన

పెద్దపల్లి రూరల్, మార్చి 1: మండలంలోని కొత్తపల్లిలో అభివృద్ధి పనుల్లో భాగంగా సీసీ రోడ్డుపై మట్టిని కనపడకుండా చేసిన విషయాన్ని 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురించడంతో అధికారులు స్పందించారు. ఈ సందర్భంగా సీసీ రోడ్డుపై పోసిన మట్టిని ఎక్స్‌కవేటర్ సహాయంతో తొలగించారు. అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించడంపై గ్రామస్థులు ఆంధ్రజ్యోతికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

అక్రమ వెంచర్లలో హద్దురాళ్ల తొలగింపు

పెద్దపల్లి రూరల్, మార్చి 1: మండలంలోని పెద్దబోంకూర్‌లో అక్రమంగా ఏర్పాటు చేసిన వెంచర్లలో పంచాయతీ అధికారులు హద్దురాళ్లను తొలగించారు. ఈసందర్భంగా పంచాయతీ కార్యదర్శి స్వప్న ఆధ్వర్యంలో అక్రమ లేఅవుట్‌లో ఏర్పాటు చేసిన హద్దురాళ్లను తొలగించి హెచ్చరిక బోర్డును ఏర్పాటు చేశారు. వారి వెంట పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

సీసీ రోడ్డుకు శంకుస్థాపన

ఓదెల, మార్చి 1: మండలంలోని పిట్టల ఎల్లయ్యపల్లిలో శుక్రవారం ఈజీఎస్ నిధులు రూ.10 లక్షల వ్యయంతో నిర్మించనున్న సీసీ రోడ్డుకు మాజీ ప్రజాప్రతినిధులు శంకుస్థాపన నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ వైస్‌ఎంపీపీ పిట్టల రవికుమార్, మాజీ సర్పంచ్‌లు పిట్టల సరిత, శంకర్, యాదగిరి స్వామి, రంజిత్, కందుల అశోక్, రఘుపతిరెడ్డి పాల్గొన్నారు.

పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కమల్

పెద్దపల్లి టౌన్, మార్చి 1: పెద్దపల్లి పట్టణ వర్తక వ్యాపార వాణిజ్య సంఘం పెద్దపల్లి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడిగా కమల్ శారద, ప్రధాన కార్యదర్శిగా సయ్యద్ మసరత్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు వారికి నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వారు మట్లాడుతూ తమ నియామకానికి సహకరించిన పట్టణ వాణిజ్య వ్యాపారస్తులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యేను పట్టణ వ్యాపారస్తులు గజమాలలతో సన్మానించారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయండి

ఎలిగేడు, మార్చి 1: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు సూచించారు. శుక్రవారం మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈనెల 3వతేదీన అప్పుడే పుట్టిన బిడ్డనుంచి ఐదేళ్ల వయసు పిల్లలందరికీ పల్స్‌పోలియో చుక్కలు తప్పక వేయించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవో యాదగిరి భాస్కరరావు, ఎంపీవో అనిల్‌రెడ్డి, పిహెచ్‌సీ డాక్టర్ నిస్సి క్రిష్టాన తదితరులు పాల్గొన్నారు.

ఆర్డర్ కాపీల అందజేత

పాలకుర్తి, మార్చి 1: బసంత్‌నగర్ కేశోరాం సిమెంటు కంపెనీలో జిప్సం, ఎర్రమట్టి పనులు చేస్తున్న 10 మంది ఔట్ సోర్సింగ్ కార్మికులకు శుక్రవారం కాంట్రాక్టు కార్మికులుగా నిత్యం పనిలోకి తీసుకునే విధంగా ఆ యూనియన్ అధ్యక్షుడు సూర సమ్మయ్య యాజమాన్యంతో చర్చించి ఆర్డర్ కాపీలను అందజేశారు. కార్యక్రమంలో ఏపీపీ హెచ్‌ఆర్, ఐఆర్ మేనేజర్ ఎస్ గోవిందరావు, యూనియన్ ప్రధానకార్యదర్శి కాల్వ అంజయ్యయాదవ్, పలు వురు కాంట్రాక్టు కార్మికులు పాల్గొన్నారు.

విద్యార్థుల చేతుల్లోనే దేశ భవిష్యత్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కోల్‌సిటీటౌన్, మార్చి 1: విద్యార్థులు క్రమశిక్షణను అలవర్చుకొని విద్యలో రాణించాలని, వారి చేతుల్లోనే దేశ భవిష్యత్ ఉందని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. శుక్రవారం గోదావరిఖని రమేష్‌నగర్‌లోని ఉషోదయ హైస్కూల్ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్‌ను పాఠశాల యాజమాన్యం సత్కరించి జ్ఞాపికను అందజేశారు. విద్యార్థుల సాంస్కృతిక నృత్యాలు అలరించాయి. కాంగ్రెస్ ఫ్లోర్‌లీడర్ మహంకాళిస్వామి, కార్పొరేటర్ బొంతల రాజేష్, ముస్తాఫా, ట్రస్మా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కంది రవీందర్‌రెడ్డి, సీహెచ్ తిరుపతిరెడ్డి, గౌరవ అధ్యక్షుడు పి అంజారెడ్డి, రామగుండం అధ్యక్షుడు అదర్‌సండె సమ్మారావు తదితరులు పాల్గొన్నారు. వార్షికోత్సవం సందర్భంగా రామగుం డం తబిత ఆశ్రమానికి రూ.25వేల ఎల్ఈడీ టీవీని కరస్పాండెంట్ కొత్త శ్రీనివాస్‌రెడ్డి బహుకరించారు.

గోదావరిఖనిలో రక్తదాన శిబిరం

కోల్‌సిటీటౌన్, మార్చి 1: అలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గోదావరిఖనిలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ఎల్‌బీనగర్‌లో 25మంది రిటైర్డ్ ఆర్మీ సైనికులు, యువకులు రక్తదానం చేశారు. రక్తదానం చేసిన రిటైర్డ్ సైనికులను ఘనంగా సన్మానించారు. అయిత శివకుమార్, జడ్పీటీసీ, బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణి, మిట్టపల్లి రాజేందర్, పరికిపండ్ల రామన్న, మల్కా రామస్వామి తదితరులు పాల్గొన్నారు. విఠల్‌నగర్‌లోని అమ్మపరివార్ ఆశ్రమంలో ఆలయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వీట్లు పంపిణీ చేసి అన్నదానం చేశారు.

రేపు గురుకుల పాఠశాల ప్రవేశ పరీక్ష

పెద్దపల్లి కల్చరల్, మార్చి 1: ఈనెల 3న మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 6,7,8వ తరగతుల్లో అడ్మిషన్ కోసం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ చెరుకు సుస్మిత శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహాత్మ జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో 6,7,8వ తరగతుల బ్యాక్ లాగ్ సీట్లు ప్రవేశం కోసం మార్చి 3న ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ప్రవేశపరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు.

అల్ఫోర్స్‌లో వీడ్కోలు సమావేశం



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

సుల్తానాబాద్, మార్చి 1: ఉన్నత లక్ష్యాలను సాధించాలన్నా, ఉజ్వల భవిష్యత్ పొందాలన్నా కష్టపడితేనే సాధ్యమవుతుందని అల్ఫోర్స్ విద్యా సంస్థల అధినేత నరేందర్‌రెడ్డి అన్నారు. సుల్తానాబాద్ అల్ఫోర్స్ స్కూల్‌లో కార్డియాల్ పేరిట టెన్త్ విద్యార్థులకు శుక్రవారం ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశాన్ని అయన ప్రారంభించారు. సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో స్పోర్ట్స్ మీట్

సుల్తానాబాద్, మార్చి 1: స్థానిక ఇండియన్ పబ్లిక్ స్కూల్‌లో శుక్రవారం స్పోర్ట్స్ మీట్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, రన్నింగ్, స్కిప్పింగ్ వంటి క్రీడలను నిర్వహించారు. స్కూల్ డైరెక్టర్ మాటేటి సంజీవ్‌కుమార్, ప్రిన్సిపాల్ కృష్ణప్రియ తదితరులు పాల్గొన్నారు.